# కథ విందువా..

రేణుక అయోల

'ఎన్నాళ్ళో వేచిన ఉదయం, ఈనాడే ఎదురవుతుంటే' పాత సినిమా పాటలో ఇద్దరు స్నేహితులు చేతులు చాచి పాడుతూ, కలుసుకోవడానికి ఆత్రపడిపోతూ, గబగబా నడుస్తూ పరుగులు పెడుతున్న సీను టి.వి.లో చూస్తుంటే ఒళ్ళు మండిపోయి, గుండె పగిలిపోయినట్లుగా ఉంది.

ఇవాళ 'మిత్రద్రోహి' అనుకోక తప్పటం లేదు. వాడు చేసిన వెధవపనికి ఇప్పుడు చూస్తున్న పాటకి గుండె మూడుచెరువుల నీళ్ళలా నిండి, దుఃఖం కట్టలు తెంచుకోవడానికి సిద్ధపడి సర్దుకుంది. ఒకప్పటి నా మిత్రుడు సుబ్బారావు చేసిన ద్రోహం తలుచుకుని, కోపం పెంచుకుని బి.పి. మాత్రమింగి స్థిమితపడ్డాను. ఆలోచనలు వదలకుండా వెంటాడి వేధిస్తున్నాయి.



నాకు నేనుగా చాలా మొహమాటస్థుడిని ఆఫీసులో, ఇంట్లో కూడా. నాకు నచ్చని ఏ విషయాన్నైనా గట్టిగా ఎవరితో చెప్పలేను. లోలోపల మథనపడి పోతానే తప్ప గట్టిగా ఏ విషయం వివరించి ఇది నాకొద్దు, కావాల అంటూ చెప్పలేను. అందుకే చిక్కుల్లో పడిపోతాను.

అందుకేనేమో ప్రతి విషయాన్ని కాగితం మీద పెట్టి కథల రూపంలో పంచడం అలవాటు చేసుకున్నాను. కాని కొన్నేళ్లగా కథలు రాయడం మానుకున్నాను. రిటైర్ అయ్యి ఇంట్లో వున్నాక, కాలక్షేపం కాక మళ్లా నా పాత అలవాటు నాకు అలవాటుగా మారుతున్న తరుణమది.

అమెరికా వెళ్ళిపోతూ మా అబ్బాయి కొని ఇచ్చిన కొత్త ఫ్లాట్‌లో బిక్కుబిక్కుమంటూ ఇద్దరం ఉంటున్న సమయంలో, ఓ రోజు పొద్దున్నే 7.30 గంటల సమయంలో సుబ్బారావు మా ఇంటి డోర్ బెల్ మోగించి, తనని తాను పరిచయం చేసుకుంటూ, మా ఇంట్లోకి చొరవగా ప్రవేశించి పలకరిస్తుంటే ఆ అతిచొరవకి ఆశ్చర్యపోయాము. ఇద్దరం ఏమీ తోచక బిక్కుబిక్కుమంటూ కొత్త ప్రదేశానికి అలవాటు పడటానికి ఇబ్బంది పడుతున్న సమయంలో, గలగలా మాట్లాడే సుబ్బారావు మాకు నచ్చాడు. అక్కడే పెద్ద పొరపాటు జరిగిపోయింది.

'కాలు జారితే వెనక్కి తీసుకోగలం, కాని స్నేహం ముదిరితే వెనక్కి తీసుకోలేం' అన్నట్లుగా సుబ్బారావు స్నేహంతో తలనిండా కట్టిన బొప్పెలతో అర్థం అయింది. దానికి తోడు నాకున్న అతి పెద్ద బలహీనత మనసులో ఉన్నవన్నీ చుట్టుపక్కల పరికించినవన్నీ కథలుగా రాయడం. నాకున్న మరో భయంకరమైన అలవాటు, కథలు పంపేముందు ఎవరికైనా చదివి వినిపించడం. చిన్నప్పుడు స్నేహితులు, ఆఫీసులో మిత్రులు వినేవారు. ఇప్పుడు నా శ్రీమతికి వినిపించడం అలవాటు. ఆవిడకి కథ వినడం, చదవడం రెండూ మహా చెడ్డ చిరాకు. ఇంక తప్పదు అన్నట్లు వింటుంది. కుదురుగా ఏ జన్మకి వినదు కథని. ''బాగుంది. బాగుంది..ఏదో ఓ పత్రికకి పంపించేయండి..'' అంటూ.. తొందరపడిపోయి, అక్కడనుంచి లేచి వెళ్లిపోయి ఏదో పని పెట్టుకుంటుంది.

అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ఆవిడకి కథలు వినిపిస్తూనే ఉంటాను.. ఇదిగో ఇలాంటి సమయంలో ఓ సాయంకాలం, ఇద్దరం కథా పఠన శ్రవణాల్లో మునిగి తేలుతుండగా కాలింగ్ బెల్ మోగింది. సుబ్బారావే వచ్చాడు. వస్తూనే విషయాన్ని గ్రహించాడు.

''కథలు రాస్తారా?'' ఆశ్చర్యపోయాడు, హత్య చేస్తారా అన్నంతగా ముఖం పెట్టి.

''అవును, అవును'' అన్నాను గర్వంగా, కాగితాల కట్టని అటూ ఇటూ తిప్పుతూ..

''నాకు కథలు వినడం చాలా ఇష్టం.. వినిపించండి'' అన్నాడు సోఫాలో తీరిగ్గా జారగిలపడుతూ.

నాలో ఆనందం ఉప్పొంగింది. ఇంతటి మంచి మనిషి ఇంకోడు ఉంటాడా ఈ భూ ప్రపంచంలో? అనిపించింది.

ఇంక మా ఆవిడ ముఖం అయితే వెయ్యి మతాబులు వెలిగినంత కాంతివంతంగా వెలిగిపోతూంది. వారానికో సారో, అప్పుడప్పుడో రోజో పడే నరకంనుంచి తనను తప్పించిన మహావిష్ణువులా సుబ్బారావు కన్పించి ఉంటాడు. జీవిత ఖైదునుంచి క్షమాభిక్ష దొరికిన ఖైదీలా ఆనందపడిపోయింది.

ఆ ఆనందంలో సంతోషంలో కాలు నిలువలేదు. ''ఉండండి అన్నయ్యగోరు, మీకో మంచి కాఫీ తెస్తాను'' అంటూ వంటింట్లోకి పరుగులు పెట్టింది. క్షణాల్లో స్ట్రాంగ్ కాఫీ, ప్లేట్‌లో జంతికలు, కజ్జికాయలు సుబ్బారావు ముందు వాలిపోయాయి.

''రిటైర్ అయ్యాక కూడా చలాకీగా కథలు రాస్తున్నారు. ఎంతైనా మీరు చాలా హుషారైన మనిషి. నాకు నచ్చారు. చక్కగా కుర్రవాడిలా రాస్తున్నావోయ్'' అంటూ నడ్డిమీద ఓ చరుపు చరిచి, ''ఏదీ వినిపించు'' అంటూ ఓ జంతిక విరిచి నోట్లో వేసుకుని కాఫీ చప్పరిస్తూ చిద్విలాసంగా కాళ్ళాడిస్తున్న సుబ్బారావు ఓ మంచి స్నేహితుడిలా, ఆపద్బాంధవుడిలా కన్పించాడు.


అలా మొదలైన మా కథా శ్రవణ స్నేహం, మా స్నేహంతో పాటు వాళ్ళిద్దరూ 'అన్నయ్యా' అంటే 'చెల్లెమ్మా' అంటూ బంధువుల్లా మారిపోయారు.

సుబ్బారావు రిటైర్ అవకముందే వాళ్ళావిడ ఫొటోకెక్కి చక్కగా నవ్వుతూ కనిపించింది. ఆ ఫొటోను చూసినప్పుడల్లా 'స్వర్గంలో సర్వసుఖాలు అనుభవిస్తూ హమ్మయ్య అనుకుని ఉంటుందని' నమ్మకం. (ఈ అభిప్రాయం వాడి చేష్టల ద్వారా తర్వాత ఏర్పడింది). అందరింట్లో ఉండే అతి సాధారణ విషయం పిల్లలు అమెరికాలో ఉండటం. వాడి ఇద్దరు కొడుకులూ అమెరికాలో ఉన్నారు.

అలా ఆలా సుబ్బారావు స్నేహం పాకాన పడి ముదురుతున్న కొద్దీ మా కష్టాలు మొదలయ్యాయి. అతనికో ఇల్లుందన్న సంగతి మేమూ, అతను మరచిపోయేంతగా సుబ్బారావు మా ఇంట్లో తిష్ట వేశాడు. పొద్దున్నే అంకం కాఫీ దగ్గరనుంచి మొదలై, రాత్రి భోజనం దాక మమ్మల్ని విడిచేవాడు కాదు. అప్పుడప్పుడు రాత్రి భోజనానికి రానని చెప్పి మమ్మల్ని కరుణించేవాడు.

మా ఆవిడకి అన్నయ్యగారి అతి చొరవ తలనొప్పిగా మారినా, నా కథల బారినుండి తప్పించుకోవడానికి మరో మార్గం లేక సహించేది. 'పోనీలెండి ఆడదిక్కులేని కొంప' అని సమర్థించుకుంటూ విసుగుని కప్పి పుచ్చుకొనేది.

ఎందుకో తెలీదు నాలో భూతం ఆవహించినట్టు కథల మీద కథలు రాసి, వినిపించి సంతోషపడేవాడిని. కాని రానున్న ప్రమాదాన్ని ఇంతకూడా పసిగట్టలేక పోయాను. 'వద్దు మొర్రో' అన్నా వినిపించుకోకుండా కథలన్నీ నా స్కూటర్ మీద అన్ని పత్రికల ఆఫీసుకులకి వెళ్లి ఇచ్చేవాడు.



అన్నిటిలో వరుసగా కథలు రావడం, కొన్నింటికి బహుమతులు రావడంతో నా పాట్లు మొదలైనాయి. ''ఈ కీర్తి అంతా నా చొరవ, నా సహకారమే కదా! లేకపోతే రిటైర్ అయి, మూల కూర్చునే నీకు ఈ భాగ్యం కూడానా?'' ఇలాంటి సూటిపోటి మాటలు, కొన్నిసార్లు సూటిగా కొన్నిసార్లు పక్కవాడిమీదనో, ఎదుటివాడిమీదనో పెట్టి సాధ్యమైనంతగా తన మనసులోదంతా బయటపెట్టేవాడు.

కథ మెచ్చుకుంటూ ఏ ఉత్తరం వచ్చినా ''చూశావా! నేను నీ కథలు విని శ్రమకోర్చి, నిన్ను పైకి తీసుకు రాబట్టే కదా నీకీ కీర్తి'' అనే వాడి మాటలు, చూపులు గుండెల్లో శూలాల్లా గుచ్చుకునేవి. తర్వాత తర్వాత వాడిలో చాలా మార్పు వచ్చింది. మెల్లమెల్లగా ఇంటికి రావడం తగ్గించేశాడు. ఎందుకు రాలేదని అడిగితే 'నీ కథలు వినడమేనా పని?' అన్నట్లు హింట్లు కొట్టి, ''ఈ మాత్రం కథలు నేనూ రాయగలను. ఏముంది ఆ కథల్లో. శిల్పమా, కథా వస్తువా? ఏమీ లేదు, బూడిద తప్పిస్తే'' అనే వేళాకోళాలు, వ్యంగ్యం బాణాలు మొదలయ్యాయి. అయినా సరే, నా స్కూటర్ అడగటం, కాఫీలు సేవించడం, ఇష్టమున్నప్పుడు భోజనానికి సరాసరి వచ్చేయడం మానుకోలేదు.

రాను రాను వాడి వింత ప్రవర్తన విసుగుని

తెప్పించేది. సూటిపోటి మాటలు మనసుని గాయపరిచేవి. అయినా నాలో ఏ మూలో దాగివున్న కథా శ్రవణ బుద్ధి ఊరుకోనిచ్చేది కాదు. (బలహీనతలు ఎలాటివైనా వాటి ఫలితాలు ఇలాగే ఉంటాయేమో?). వాడిని బతిమాలి కథ వినిపించేవాడిని. ఎందుకంటే మా ఆవిడకి ఇప్పుడు నా కథ వినే అలవాటు పూర్తిగా తప్పిపోయింది.

కథ వింటావా అనగానే ముఖం మీద ఖచ్చితంగా వినను అనే ధైర్యం, తెగువ వచ్చేశాయి.



## వర్మ సార్‌నే నమ్ముకున్నా!

వరుస ఫ్లాప్‌లతో అల్లాడుతున్న ప్రియమణి తన రాబోయే చిత్రాల సక్సెస్ విషయంలో దేవుడిని కాకుండా దర్శకుడు రామ్ గోపాల వర్మను నమ్ముకుందట! "హీరోయిన్ అందాలను ఎలా ప్రజెంట్ చేయాలో వర్మ సార్‌కి బాగా తెలుసు. అందుకే ఆయన్నే నమ్ముకున్నా. ఈ సారి నాకు 'పెళ్ళయిన కొత్తలో' అంత సక్సెస్ గ్యారంటీ" అంటూ గొప్పలు పోతోంది ప్రియమణి. ఇంతకీ అసలు సంగతేంటంటే.... వర్మ తీస్తున్న 'రక్త చరిత్ర'లో ప్రియమణి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇవి కాక మణిరత్నం సినిమాలోనూ, మరో సినిమాలో నటిస్తున్నా, 'రక్తచరిత్ర' పైనే ఆశలన్నీ పెట్టుకుందట! ఈ సినిమాతో సక్సెస్‌ని సొంతం చేసుకుంటానని కూడా గొప్పలు పోతోంది ప్రియమణి. అన్నట్టు మణిరత్నం 'రావణ' చిత్రంలో ప్రియమణి నటను బిగ్ బి తెగ మెచ్చుకున్నాడట! అంటే...త్వరలోనే ప్రియమణి కూడా బాలీవుడ్‌లో సెటిల్ అయిపోతుందేమో అన్న గుసగుసలు టాలీవుడ్, కోలీవుడ్‌లలో షికారు చేస్తున్నాయి.

అందుకే వాడే శరణ్యం అనుకున్నప్పటికీ.. ఈ లోగా జరగరాని నష్టం జరిగిపోయింది.

నా కథల ద్వారా పరిచయం ఏర్పడిన సాహిత్య అభిమానులు కథకులు చాలామంది దగ్గరయ్యారు. అభిమానించారు. స్నేహాన్ని పెంచుకున్నారు. ఇలా సాఫీగా, ఆనందంగా సాగిపోతున్న జీవితంలో తుఫాను రేగింది. అరవై ఏళ్ల వయసులో మనోవేదన, అశాంతి కోరి తెచ్చుకున్నట్లయింది.

ఒక సుబ్బారావు అనబడే వ్యక్తి స్నేహం, నా మనోఫలకాన్ని ముక్కలు ముక్కలు చేసింది. మనసు మంచు ముద్దగా చచ్చుబడిపోయింది. వాడు మా ఇంట్లో ఫోన్లు వాడుకుని, కంప్యూటర్‌ని వాడుకుని, సోఫాలో పడుకుని, ఇంటిని తన ఇంటిగా చేసుకున్నాడు. తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టేలా మారిపోయాడు.

'వాడు అన్నీ ఇంగ్లీషు నవలలు, కథలు చదివి కాపీ కొట్టి కథలు రాస్తున్నాడంటూ' నా మీద, నా కథల మీద దుష్ప్రచారం మొదలు పెట్టాడు.

చెడుని మించిన టానిక్ ఈ ప్రపంచంలో మరొకటి లేదు. నా కథ ఏ పత్రికలో పడ్డా నాకు ఫోను చేసి "కథ బాగానే ఉంది కాని, ఇదేదో ఇంగ్లీషు కథ కాపీలా ఉందే!" అని సాహిత్యాభిమానులు సాగదీయడం మొదలయింది. నేను వాళ్లకు సర్ది చెప్పి, ఎందుకిలా అంటున్నారు అని అనుకుంటూ మథన పడిపోవడం, వాళ్ళు తోచిన సమాధానం చెప్పడం.. ఆ తరువాత నా ఫోన్ బిల్లు చూసుకొని గొల్లుమనడం జరిగిపోతూనే ఉంది.

ఓ శుభోదయాన అసలు విషయాన్ని, రాజారావనే స్నేహితుడు ప్రమాణాల మీద ప్రమాణాలు చేయించుకుని, "నీ ఇంట్లో నీ పర్మినెంట్ గెస్ట్ , నీ ఫ్రెండ్ సుబ్బారావు నీ మీద ప్రచారాల ఫలితమే ఇదంతా" అన్నాడు.

అంతటి షాక్ ఇన్నేళ్ల జీవితంలో ఎదురవ్వలేదు. సాఫీగా సాగిపోయే నా అరవై ఏళ్ల వయసులో మనశ్శాంతిని పోగొట్టిన స్నేహితుడి అవతారం పది తలల రావణాసురుడి బొమ్మలా భయపెట్టింది.

అందుకే పొద్దున్నే టివిలో వస్తున్న పాట వినగానే ఒళ్లు మండిపోయింది.

ఇంతలో సుబ్బారావు కాలింగ్ అంటూ టేబిల్ మీది సెల్‌ఫోన్ కదులుతోంది. మా ఆవిడ అతి శ్రద్ధగా చూస్తున్న టివి సీరియల్ మధ్యలోంచే "అన్నయ్యగారి ఫోన్.. ఇప్పటికి చాలాసార్లు చేశారు మీరు బజారుకెళ్లినప్పుడు.. అలా చూస్తూ వుండిపోయారేం. ఎత్తండి. పాపం! మీ కథ వినాలని కుతూహలంగా ఉందేమో" అంది అగ్గిమీద అజ్యం పోస్తూ.

అసలే రాజారావు మాటలు వినడం, సుబ్బారావు అసలు స్వరూపం బయటపడటంతో గుండెలు మండిపోతుంటే, శ్రీమతి గారి కామెంట్‌తో నాలో కోపం బుసలు కొట్టింది. రివ్వున టేబిల్ మీద ఉన్న సెల్‌ఫోన్ అందుకుని, బ్యాటరీ లాగి అవతల పారేశాను.

"ఇదిగో.. ఇవ్వాల్టినుంచి చెబుతున్నాను. నా కథ ఎవరికీ వినిపించను. అర్థం అయిందా." గట్టిగా అరిచాను.

"పోనీలెండి. ఇన్నాళ్లకు మంచి నిర్ణయం తీసుకున్నారు. అన్నయ్యగారికి సేవలు చెయ్యలేక చచ్చిపోతున్నాను" అంది.

ఒళ్ళు ఇంకా మండిపోయింది. "ఇదంతా నీ వల్లే...ఏం? నా కథ వింటే అరిగిపోతావా? తరిగిపోతావా? ఆ దిక్కుమాలిన సీరియల్స్ చూడకపోతే" అన్నాను ఆవేశపడిపోతూ.

అపరకాళికలా లేచింది. "ఏం ఎందుకు వినాలి మీ కథ? రాసుకోండి. పోస్టు చేసుకోండి. అంతేకానీ అర్ధరాత్రి అపరాత్రి లేకుండా కథలు వినండో అంటూ వెంటబడతారెందుకు?"

"నేను అర్ధరాత్రుళ్లు, అపరాత్రుళ్లు వెంటబడుతున్నానా? అబద్ధాలాడకు. అయినా ఇదన్నమాట నా మీద వున్న అభిమానం. ఏం ఆ మాత్రం కథ వింటే? ఇదిగో ఇదే ఆఖరుసారి. ఈ సారి నువ్వు అరచి గీ పెట్టినా నా కథ వినిపించను"

"చాలా సంతోషం! ఆ మాటమీద నిలబడండి" అంది ఏ మాత్రం నా బాధని లెక్కచేయకుండా.

భార్య విసుగుదల, నా మీద ఉన్న నిర్లక్ష్యం, నన్ను లెక్క చెయ్యకపోవడం పైగా 'వాడితప్పేముంది' అన్నట్లు మాట్లాడటం, మతిపోయినట్లు అనిపించింది.

గభాలున చెప్పులు వేసుకుని, తలుపు విసురుగా తీసి, రెండు గుమ్మాల అవతల ఉన్న సుబ్బారావు ఫ్లాట్‌కి వెళ్లి కాలింగ్ బెల్ మోగించాను. వాడు తలుపు తీసి ఏదో అనేలోగానే "సుబ్బారావ్! ఇంకెప్పుడు మా ఇంటికి రాకు. వచ్చావంటే ఇప్పటిదాక నా మంచితనం చూశావ్. ఇక నాలో వున్న చెడ్డవాడ్ని చూస్తావ్" అన్నాను. వాడు ఆశ్చర్యంతో గుడ్లు పెద్దవి చేసి చూస్తుంటే, ఇంట్లోకి వచ్చి పడ్డాను. తల మీదనుంచి వెయ్యి మణుగులు బరువు దిగిన వాడిలా హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

ఆ తర్వాత వారం రోజుల పాటు ఇంట్లో ఇద్దరం ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.. ఇది మా సంసారంలో ఎన్నడూ జరగని విషయం. చిన్నపిల్లల్లా కూతురి దగ్గర, కొడుకు దగ్గర ఫోన్లల్లో ఒకళ్లమీద ఒకళ్లు చాడీలు చెప్పుకున్నాం.

కొన్నాళ్లకి అన్నీ సర్దుకున్నాయి. పంతాలు తగ్గాయి. కోపాలు పోయాయి. కాని ఒక స్నేహం, ఒక మనిషి. జీవితాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేయగలదో అర్థం అయ్యాక స్నేహం అంటేనే హడల్ పుట్టింది.

నాలో మార్పు వచ్చింది. నా కథలకి నేనే శ్రోతనయ్యాను, కథ రాసి పైకి చదువుకోవడం మొదలు పెట్టాను. మా ఆవిడకి చాలా ఆనందంగా ఉంది నాలో మార్పు చూసి. హాయిగా టివి సీరియల్స్ చూసుకుంటూ "మీరూ చక్కగా సీరియల్స్ రాయకూడదూ" అంది ఓ సలహా పారేస్తూ.

*

రచయిత్రి సెల్ నెం: **9963889298**